
# అమ్మకోపం

– పి.యస్. లక్ష్మి



**ప్రేమానురాగాల పూదోట, సంతోష సరాగాల కమ్మని పాట ఆ యిల్లు. జీవన మకరందాన్ని గ్రోలుతూ సంతోషాతిరేకంతో ఝుమ్మంటూ పూదోటంతా విహారం చేసే సీతాకోక చిలుకలు ఆ యింట్లోని వ్యక్తులు. ఆ యింటి సింహద్వారం బంధుమిత్రులకు స్వాగత గీతాన్నాలపించే సంగీత వాయిద్యం. సంస్కృతికి, సంప్రదాయానికి వేసిన పెద్దపీట గడప. నైతిక విలువలకు పెట్టనికోట ప్రాకారపు గోడ. సంతృప్తి, సరదా పరదాలైతే పరువు మర్యాద పచ్చని తోరణాలు. ఆరోగ్యం, ఆనందం ఆ యింటి ఆనవాళ్ళు.**

సుధాకర్, నీరజ ఆ యింట్లో పదేళ్ళుగా కాపురముంటున్నారు. ఇంటికి పెద్ద దిక్కు రాజేశ్వరమ్మయితే చిగురుటాకులు శిరీష, నానీ. బంధుమిత్రుల్లో, ఇరుగు పొరుగు కుటుంబాల్లో ఆ యింటికొక ప్రత్యేక స్థానం, విలువ, గుర్తింపు. చిన్నవయసులోనే ఉన్నతోద్యోగంలో చేరి అంచెలంచెలుగా పైకెదిగి కుటుంబ సౌఖ్యానికి మూలస్తంభమైన సుధాకర్, అందం, ఆకర్షణ, చదువు సంస్కారాల మేలి కలయికతో, చక్కటి వ్యక్తిత్వంతో వెలుగులు వెదజల్లే నీరజ, ముద్దుమొహాలతో మురిపాలను పంచే పసివాళ్ళు, పెద్దరికంతో పదిమందినీ ఆకట్టుకునే రాజేశ్వరమ్మ – ఎవరికి వారే ప్రత్యేక ఆకర్షణ. కుటుంబం పెరిగినట్లే ఆత్మీయత, ఆనందమూ పెరిగాయి. రోజులు గడిచేకొద్దీ భార్యాభర్తల నడుమ, అత్తాకోడళ్ళ మధ్యన అనుబంధాలు ధృడమయ్యాయే కానీ అభిప్రాయబేధాల పగుళ్ళు పొడసూపలేదు. పదిలంగా ఉన్న ఆ పొదరింట్లో తెల్లవారింది.

తెల్లవారి లేస్తూనే కోడలు ఎప్పటిలా లేదన్న విషయం గమనించింది రాజేశ్వరమ్మ. ఇంటి పనులన్నీ యాంత్రికంగా, నిరాసక్తంగా చేస్తున్నట్లుగా తోచింది. అందునా ఆరోజు ఆదివారం. సెలవు సందడి. పిల్లల అల్లరితో, తల్లి అరుపులతో, తండ్రి లాలింపుతో మొదలౌతుంది. వాళ్ళ అల్లరికి నేపథ్యం సంగీతం. టి.వి. ప్రకటనల హోరు. టేప్‌రికార్డర్‌లో సరికొత్త పాటల ట్యూనుల



జోరు. ట్యూనుల కనుగుణంగా వేసే డాన్సు స్టెప్పులతో పిల్లల హుషారు చెప్పనలవి కాదు. మధ్యాహ్నం అన్నాల వేళగ్గాని సందడి సద్దుమణగదు. అలాటి రోజున కోడలు నిర్లిప్తంగా యిల్లు నిశ్శబ్దంగా వుండటం ఏదోలా వుంది. నిన్న సాయంత్రం వేళ బెంగాల్ కాటన్ చీరె కట్టుకుని, మల్లెలు, మరువాల పూమాల తల్లో పెట్టుకుని కూనిరాగాలు తీస్తూ, సంతోషానికి నిర్వచనంలా, సగర్వంగా ఇల్లంతా కలియతిరిగిన కోడలు తెల్లారేసరికి ఓడిపోయిన దానిలా తల దించుకుని ఆలోచనల్లో కూరుకుపోవడం వింతగానూ, ఒకింత భయంగానూ తోచిందామెకి.

***

నానమ్మా! అక్క చూడు... నన్ను ఏడిపిస్తోంది. అక్క మీది తొలి పితూరీతో నిద్రమంచం దిగి వచ్చాడు నానీ.

సిరీ! ఏంటమ్మా... తమ్ముణ్ణి ఏడిపించ వచ్చా! నేనేమన్నాను నానమ్మా... శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం అని ఆంజనేయ స్వామి స్తోత్రం చదువుతున్నాను. అదేమన్నా తప్పా! తిట్టా! చెప్పు... గడుసుగా ప్రశ్నించింది ఎనిమిదేళ్ళ శిరీష.

ఐదేళ్ళు నిండుతున్నా ఇంకా నోట్లో వేలు మానని నానీని అప్పుడప్పుడు స్వామి పేరుతో పిలిచి ఉడికించటం శిరీష కొంటెతనం. స్వామికీ, తనకూ పోలిక ఎందులోనో క్షుణ్ణంగా తెలిసిన నానీకీ అక్క వెక్కిరింత గుర్తున్నంతసేపు నోట్లో వేలు పడదు. రాత్రి నిద్దర్లో వేలేసుకుని వుంటాడు. తెల్లారుతూనే అక్కకి దొరికిపోయాడు.

నా చిట్టితండ్రీ ... నా బంగారు కొండ... ఆంజనేయస్వామిలా చిరంజీవివై, వీరాధి వీరుడివై పెద్దయ్యాక ఎన్నెన్ని ఘనకార్యాలు చేస్తాడో... మా నానిపండు! మనవణ్ణి ముద్దు చేస్తూ ఒళ్ళో కూర్చోబెట్టుకుంది రాజేశ్వరమ్మ. నానమ్మ దీవెనతో ముఖం విప్పారినా నానీ ముచ్చట్లలో పడిదిగాడు. మరి నానమ్మా! రాత్రి నాకు కల్లో... మహాకావ్యాన్ని వినిపించే ప్రయత్నంలో పడ్డాడు.

రాత్రిళ్ళు నానమ్మ పక్కన పడుకుని కమ్మని కథలు వింటూ హాయిగా నిద్దర్లోకి జారుకోవడం, రాత్రి కల్లో తాము చూసిన వింతల్ని, విశేషాల్ని తెల్లారి నానమ్మ ఒడిలో కూర్చుని వివరించటం పిల్లల అలవాటు. తమ కలల్ని కొట్టేపారేయని, భయాలను తోసిపుచ్చని నానమ్మంటే పిల్లలకెంతో మక్కువ. రాజేశ్వరమ్మకు పుట్టిన పిల్లలు పోగా పోగా ఆఖరున దక్కినవాడు సుధాకర్. జన్మ సాఫల్యంగా, పూర్వజన్మ పుణ్యఫలంగా భావించి కొడుకును అరచేతుల్లో పెట్టుకుని పెంచింది. ఆమె పెంపకానికి వన్నె తెస్తూ సుధాకర్ ప్రయోజకుడయ్యాడు. కొడుకు మనసెరిగి అతనికి జోడీగా నీరజను ఎంపిక చేసింది. తల్లి నిర్ణయాన్ని సదా మన్నించే సుధాకర్ భార్య ఎంపికలోనూ తల్లి మాటకే విలువిచ్చాడు. నీరజను జీవిత భాగస్వామిగా చేసుకున్నాడు. రాజేశ్వరమ్మ ఊహించినట్లే, ఆశించినట్లే సుధాకర్ సుఖసంతోషాలు పదింతలైనాయి. బంధుమిత్రుల సమక్షంలో కొడుకు కోడలు సొంత యింట్లోకి అడుగుపెట్టిన నాడు రాజేశ్వరమ్మ ఆనందానికి అవధి లేకపోయింది. భర్తతోటి జీవితమంతా ఆనందంగానే గడిచినా సొంత యిల్లు లేదన్న చిన్న అసంతృప్తి ఆమెకు మిగిలిపోయింది. సుధాకర్ ఉద్యోగరీత్యా హైద్రాబాద్‌లోనే స్థిరపడటంతో సొంత యిల్లు, అందులో నివాసం సానుకూలమయ్యాయి. కొడుకు సమర్థతను చాటుతూ, అతని అభిరుచికి అడుగడుగునా అద్దంపట్టే ఆ యిల్లంటే ఆమెకు తగని మక్కువ.

చిరుమొలకను తాను పెంచి పెద్దచేస్తే అది మహావృక్షమై తనకు నీడనిస్తున్నదన్న సంతృప్తిని మదిని నింపుకుని జీవన సంధ్యలోని అందాలను ఆస్వాదిస్తున్న సమయాన... కోడలి మనస్తాపానికి కారణమేమై వుంటుందన్న ఆలోచన ఎంతకీ తెగటం లేదు రాజేశ్వరమ్మకి.

అత్తాకోడళ్ళీ విషయాన్ని సులువుగా తీసుకోలేకపోయారు. ఇరువురి పుట్టింటి నేపథ్యం సనాతనం. సంప్రదాయబద్ధం, నైతిక విలువలకు పట్టం కట్టేది కావడంతో వారీ విషయాన్ని అంగీకరించలేకున్నారు. అత్తగారి దృష్టికి విషయం పోకుండానే సమస్యను చక్కదిద్దాలనేది నీరజ ఆలోచన.

కాఫీ తీసుకోండత్తయ్యా... గ్లాసును అత్తగారి ముందుంచి వెళ్ళింది నీరజ. వేడివేడి కమ్మని కాఫీ గొంతులో పడ్డాక ఆందోళన తగ్గి మనసు కాస్త కుదుటపడినట్లయింది. పిల్లలతో ముచ్చట్లు ముగిశాక కోడలికి పనిలో సాయం చేసేందుకై వంటగదిలోకి నడిచింది రాజేశ్వరమ్మ.

***

ఏమిటండీ ఇదీ!

ష్! గొడవ చెయ్యకు... పార్టీలో ఫ్రెండ్స్ బలవంతం చేస్తే...

అత్తయ్యగారి గురించి ఆలోచించారా?! ఈ విషయం తెలిస్తే ఆవిడేమౌతుందో తెలుస్తుందా మీకు?

అమ్మకెలా తెలుస్తుంది?! అయినా దీనికింత రాద్ధాంతం ఏమిటి?! లైటు తీసెయ్యి... నిద్రొస్తోంది...

ఒక నిద్రపోయి లేచిన రాజేశ్వరమ్మకు కొడుకు - కోడలి మాటలు అస్పష్టంగా చెవిన పడ్డాయి. హాల్లోని ఎటాచ్‌డ్ బాత్‌రూమ్ సుధాకర్, నీరజల బెడ్‌రూమ్ ప్రక్కగా వుండడంతో అటుగా వచ్చిన ఆమెకు విషయం అర్థమైంది. కోడలి మొహం చిన్నబోయి వుండటానికి గల కారణం అవగతమైంది. కోడలి గొంతులోని దుఃఖపు జీర ఆమె గుండెల్ని కోసింది.

సుధాకర్ తాగివస్తున్నాడు. మంచి ముత్యమని తను మురిసిపోయిన తన కొడుకు ఇంటికి తాగి వస్తున్నాడు. వాస్తవాన్ని ఒప్పుకోవటానికి ఒంట్లోని అణువణువు మొరాయిస్తుంటే నిశ్చేష్టయై హాలు మధ్యలో ఒక్కత్తే నిలబడిపోయింది రాజేశ్వరమ్మ. మనశ్శరీరాలు రెండూ వశం తప్పినట్లయింది. చేతికర్ర ఆసరా మొదటిసారిగా కావాలనిపించింది. తన్ను తాను నిలువరించుకోలేక సోఫాను పట్టుకుని నెమ్మదిగా అందులోకి జారగిలబడింది. ఆ క్షణాన ఆమెకు కొడుకు పట్ల మమకారం నశించింది. సుధాకర్ తానెన్నడూ ఎరుగని కొత్త వ్యక్తిలా గోచరించాడు. పెంపుడు జంతువని ప్రేమగా నిమరబోతే అది హఠాత్తుగా రూపం మార్చుకుని క్రూరమృగమై కబళించేందుకు మీదికి ఉరికొస్తే తప్పించుకోవటం తెలియని నిస్సహాయస్థితి ఆమెది. గతం, వర్తమానం, గతించిన భర్తతోడి సాహచర్యం ఆలోచనలన్నీ ఒక్కసారిగా చుట్టుముట్టాయామెను. కొడుకు పట్ల తమ ఇరువురి అనుబంధం పట్ల తాను పెట్టుకున్న నమ్మకాలు, ఆశలు చెల్లాచెదురైన భావన. ఆయువుపట్టున దెబ్బతగిలిన పిట్టల్లే విలవిలలాడింది ఆ పెద్ద ప్రాణం అర్ధరాత్రివేళ. ఆలోచనల అలల తాకిడికి అలసిన ఆమె మనశ్శరీరాలకు స్వాంతన చేకూరుస్తూ నిద్రాదేవి ఆమెను తన ఒడిలోకి తీసుకుంది ఏ తెల్లవారుఝాము వేళో.

***

అయిదారు నెలలు గడిచాయి. సుధాకర్ అడపాదడపా తాగి వస్తూనే వున్నాడు. షాపులో కొనుగోలు చేసిన కొత్త వస్తువును ఇంటికి తెచ్చినంత మామూలుగా తన కొత్త అలవాటును తీసుకువచ్చాడు. తన అలవాటు ఇంట్లో వాళ్ళకు అభ్యంతరమేమోనన్న ఆలోచనే అతనికి కలుగలేదు. కన్నతల్లికి, కట్టుకున్న భార్యకి ఆగ్రహం కలుగుతుందేమోనన్న వెరపు అసలే లేదు. సగటు మగవాడి ప్రవర్తన. అత్తాకోడళ్ళీ విషయాన్ని సులువుగా తీసుకోలేకపోయారు. ఇరువురి పుట్టింటి నేపథ్యం సనాతనం. సంప్రదాయబద్ధం, నైతిక విలువలకు పట్టం కట్టేది కావడంతో వారీ విషయాన్ని అంగీకరించలేకున్నారు. అత్తగారి దృష్టికి విషయం పోకుండానే సమస్యను చక్కదిద్దాలనేది నీరజ ఆలోచన. అయితే ఎదిగిన కొడుకును గిరిలో నిలపటమెలాగన్నది రాజేశ్వరమ్మ ఆందోళన.

స్త్రీ మనోభావాలను కుటుంబం, సమాజం ఏ మాత్రం లక్ష్యపెట్టదనేందుకు సరైన దాఖలా పురుషుల మద్యపాన వ్యసనమే. ఎన్ని కుటుంబాలు వ్యసనానికి బలైపోతున్నాయో!?

ఓసారి కూరలు కొనేందుకు వాకిట్లో గేటు ముందు నిలబడింది నీరజ. ముప్ఫై, నలభై వయసున్న ఓ వ్యక్తి తూలుకుంటూ రోడ్డు వెంబడి నడుస్తున్నాడు. నడవాలన్న అతని ప్రయత్నం సఫలం కావడం లేదు. మధ్యమధ్య వెనక్కి తిరిగి చూస్తూ, కోపంతో అరుస్తూ, తిట్టుకుంటూ సిగ్గు



తెలియని, గమ్యం లేని ఒంటరి నడక. వెనుక నుండి వచ్చిన పది పన్నెండేళ్ళ పిల్లాడు అతని చేయి పట్టుకుని ప్రాధేయపడుతున్నాడు. నాన్నా పుస్తకం.... నాన్నా.. పుస్తకం... నాన్నా టీచరు కొడుతోంది నాన్నా... మళ్ళీ మళ్ళీ అడుగుతున్నాడు. తండ్రి నాస్థితిలో చూడడం అలవాటల్లేనే వుంది. కాసేపు తండ్రి చేతులు పట్టుకుని బ్రతిమలాడి, ప్రాధేయపడి తండ్రి ఈ లోకంలోకి ఇప్పట్లో రాడని అర్ధమై నిరాశగా వెళ్ళిపోవడం గమనించిన నీరజకు అంతకుమించిన విషాద దృశ్యం సృష్టిలో మరొకటి వుండదనిపించింది. ఇది మంచి ఇది చెడు అని దిశా నిర్దేశం చేయవలసిన తండ్రి, దగ్గరుండి విద్యాబుద్ధులు నేర్పవలసిన తండ్రి... వద్దకొచ్చిన కొడుకు ఏమడిగాడో అర్థంకాని నిషాలో...

తాగిన మైకంలో రైల్వే లైనును దాటుతూ వేగంగా వస్తున్న రైలును గుర్తించక, ఫలితంగా రైలు గుద్దేస్తే రెండు కాళ్ళూ పోగొట్టుకుని భారంగా బ్రతుకెళ్ళదీస్తున్న పనిమనిషి వరాలు మొగుడు స్ఫురణకొచ్చాడు. కొండల్ని పిండి చేసేంత బలంగా వుండేవాడు. పాచిపని చేసి పెళ్ళాం తెచ్చిపెట్టే చద్ది మెతుకులకోసం ఎదురుచూస్తూ... ఆడారోజున చచ్చినా నాకీబాధ లేకపోనమ్మా... రోజూ గోడు వెళ్ళబోసుకునే వరాల్ని ఏమి చెప్పి ఓదార్చాలో తోచని సందిగ్ధత.

రాజేశ్వరమ్మ, నీరజల ఆలోచనా ప్రవాహానికి అంతేలేదు. తామేదో ఊబిలోకి దిగబడిపోతున్నామన్న భయం, దిగులు ఇరువురి గుండెల్లో.

★★★

తెల్లవారింది. పేపరుకోసం అలవాటుగా సుధాకర్ హాల్లోకి నడిచాడు. గుమ్మానికెదురుగా కళ్ళజోడు సవరించుకుంటూ పేపరు చదివే తల్లి కనిపించలేదు. వెలుతురు బాగా పడుతుందని రోజూ ఆ వేళలో అక్కడే ఆమె పేపరు చూస్తుంటుంది. తల్లికోసం ప్రత్యేకించి తెలుగు పేపరు. పేపరు చదవటం ముగిశాక ఇద్దరూ కాసేపు పేపర్లోని విషయాల గురించి మాట్లాడుకునేవారు. సామాజిక సమస్యల పట్ల ఆమెకున్న అవగాహన, విశ్లేషించే తీరు సుధాకర్‌ను ఆకట్టుకునేది. 'రాజ్యమేలగల స్త్రీలు సైతం అంట్లే తోముతున్నారు' చలంగారి కొటేషన్ గుర్తొచ్చేది. ఈవేళ దాకా అమ్మ పడుకోవటమా... సందేహంగా తల్లి గదిలోకి నడిచాడు. మంచంపై రాజేశ్వరమ్మ లేదు. పక్కనే వున్న చిన్న టీపాయ్‌పై పేపర్‌వెయిట్ కింద మడతపెట్టిన తెల్లని కాగితం. కాగితం మడత విప్పాడు. చదువుతుంటే తల్లి గుండె చప్పుళ్ళని వింటున్న ఫీలింగ్.

చి. సుధాకర్‌ను దీవించి వ్రాయునది,

నిన్ను వదిలి వుండాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. ఆ పరిస్థితి వస్తుందేమోనన్న ఊహ అసలే లేదు. నీ పసివయసులో ఒక్కరోజు కూడా నిన్నొదిలి నేనుండలేదు. ఈ పెద్దవయసులో నిన్నూ, ఇంటిని వదిలివెళ్ళాల్సిన పరిస్థితి నాకు కల్పించావు. చిన్నతనం నుండీ నీచేత ఏ పనీ బలవంతంగా చేయించిన గుర్తు లేదు. తిండీ, నిద్రా, చదువు, బట్టలు, ఆటలు, బొమ్మలు అన్నీ నీ ఇష్ట ప్రకారంగానే జరిగేవి. కానీ నీ సరికొత్త అలవాట్లని, అభిరుచుల్ని నా నెత్తిన రుద్దే ప్రయత్నం నువ్వు చేస్తున్నావు. దేని గురించి మాట్లాడుతున్నానో నీకీపాటికి అర్ధమయ్యే వుంటుంది.

నీ చేష్టల్ని నేను చూసీ చూడనట్లున్నానంటే జరిగేది నాకు సమ్మతమై కాదు. నీ తప్పు దిద్దుకుంటావనే నమ్మకంతో. దానికి భిన్నంగా నువ్వు మమ్మల్ని నీ దారిలోకి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నావు. నా ఎదురుగా రాత్రి నువ్వు నీ ఫ్రెండ్స్‌కు మందుపార్టీ ఇవ్వటం ఆ ప్రయత్నంలో భాగమే. నా గుండె దహించుకుపోతున్నది. నా ఆత్మగౌరవం మంటగలిసింది. నా పెద్దరికం కాలి బూడిదయింది. ఇక నీ దగర నేనుండటమంటే నన్ను నేను తక్కువ చేసుకోవడమే. నాకున్న ఒకే ఒక్క సంతానం మగబిడ్డ అయినందుకు ఎంతగానో సంతోషించాను. నా కన్నబిడ్డ చేత తల కొరివి పెట్టించుకునే భాగ్యం నాకిచ్చినందుకు దేవుడికి ధన్యవాదాలు చెప్పుకునేదాన్ని. అయితే ఆ భాగ్యం నాకు, అర్హత నీకు లేదనుకుంటాను. మద్యం గ్లాసు పట్టుకున్న చేత్తో నువ్వు తలకొరివి పెడితే నాకది

# జెమీమాకు సవతి పోరు?



శత్రువు పోరైనా భరించచ్చు కానీ సవతి పోరు భరించరానిదట. ఇలాంటి ఇబ్బందుల్లో సవతిని తిట్టలేక మొగుణ్ని వదల్లేక ఇబ్బందిపడుతోంది మాజీ క్రికెటర్ ఇమ్రాన్‌ఖాన్ భార్య జెమీమా గోల్డ్‌స్మిత్. ఇమ్రాన్‌ఖాన్‌కు పెళ్ళయ్యేనాటికి 42 సంవత్సరాలు. లేటు వయసైనా సరే ఘాటుగా ప్రేమించి పెళ్లిచేసుకున్న జెమీమా... ఇమ్రాన్ రహస్యంగా నడిపిన ప్రేమాయణం ఇప్పుడు ఆమెను చికాకు పరుస్తోంది. ఒకప్పుడు ఇమ్రాన్ సిటావైట్ అనే సుందరి వెంట తిరిగి వివాహేతర సంబంధం నెరిపాడన్నది అసలు సారాంశం. ఈయన రహస్య శృంగారం మూలంగా ఒక బిడ్డకూడా జన్మించింది సిటాకు. ఈ విషయాన్ని మరుగున పరచాలని నాకూ-ఆమెకూ సంబంధమే లేదని బుకాయించిన ఇమ్రాన్‌ను సిటా కోర్టుకీడ్చింది. ఈ బిడ్డ ఖచ్చితంగా నాకూ-ఇమ్రాన్‌కూ కలిగిన సంతానమేనని కోర్టులో దావా వేసింది. ఎట్టకేలకు కోర్టులో ఆమే గెలిచింది. ఇదంతా తెలుసుకున్న జెమీమా... చేసేది లేక సర్దుకు పోయింది. అయితే సిటా కూతురు తిన్నగా జెమీమా ఇంట్లోకి రావడం.. తన కొడుకుతో ఆడుకోవడం చేస్తూంది. మాజీ ప్రేయసి కూతుర్ని జెమీమా మంచిగానే చూసుకుంటోంది. కొన్నిరోజుల తర్వాత పాప వచ్చినా సరైన రెస్పాన్ లేకపోవడం, ఫోన్‌లు చేస్తే పలక్కపోవడం వంటివి చేస్తున్నాడు ఇమ్రాన్‌గారు. అంతేకాదు వారికీ నాకూ ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నాడుట. దీంతో గొడవ మళ్లీ మొదటికొచ్చింది. ఇస్లాం ఆచారం ప్రకారం బహుభార్యత్వానికి అర్హుడైనా తనను కాదు పొమ్మనడమే అసలైన తప్పు అని సిటా వాదిస్తోంది. అందుకే ఆయనను దేవుడు క్షమించలేదని, రాజకీయ పార్టీని స్థాపించి ఘోరంగా విఫలమయ్యాడని ఆరోపిస్తోంది. ఇదంతా చూస్తున్న కోటీశ్వరురాలు జెమీమాకు మాత్రం ఏం చేయాలో అర్థం కాక జుట్టు పీక్కుంటోంది. సవతిపోరంటే ఇలాంటిదే మరి.

తీరని అవమానం. నా మరణవార్త నీకు తెలియకుండా జాగ్రత్తపడతాను. ఆరో నెలన నీకన్నప్రాసన చేసిన నాటినుండి నే చేసే ప్రతి వంటకం నీ కోసమే. నువ్వు ఇష్టంగా తినాలని ఎన్నిరకాలుగానో చేసేదాన్ని. నీకు గుర్తుందో లేదో?! పదేళ్ళు వచ్చేవరకు నీకు తీపి అంటే పడేది కాదు. తీపి తిన్నరోజున సాయంత్రానికి డొక్కలు ఎగరేసే వాడివి. పండుగ రోజున కూడా మన యింట్లో తీపి పిండివంట చేసేదాన్ని కాదు. నీ కోసం నేను, మీ నాన్న తీపి తినడం మానేశాము. నువ్వు మాకోసం ఆ చేదు విషం మానుకోలేకపోయావు. నువ్వు చెప్పకుండానే నీ యిష్టాయిష్టాలు తెలుసుకుని మసలుకుంటుంది నీరజ. నీకు ఎలర్జీ అని తన కిష్టమైన సంపంగి పూలను దూరంగా వుంచింది. తను కట్టే ప్రతి చీరా, పెట్టుకునే నగా నీకు నచ్చుతుందో లేదోనని ఆలోచిస్తుంది. గతంలో నేను, వర్తమానంలో నీ భార్య ఎన్ని త్యాగాలు, సర్దుబాట్లు చేసుకుంటే నువ్వివాళ సుఖజీవనం గడపగలుగుతున్నావు?! బదులుగా నువ్వు మాకి స్తున్నదేమిటి? మా యిష్టాయిష్టాలను గుర్తించాల్సిన నైతిక బాధ్యత నువ్వు మరిచావు. కూడూ, గుడ్డా పడేస్తే చాలు ముసలివాళ్ళు ఓ మూలన పడి వుంటారనే నీ అహంకార ధోరణి నన్ను బాధి స్తోంది. అది నా పెంపకానికే అవమానం. ఫ్రెండ్స్ అంటావు. తాగకుంటే నీ ఫ్రెండ్స్ నిన్ను ఉరి తీస్తారా? నాకంటె, నీరజ కంటె ఎక్కువ వాళ్ళా నీ ఫ్రెండ్స్?!

మీ నాన్న నా పేర రాసిన ఇళ్ళూ, స్థలాలు నీకివ్వ బోనని నిన్ను బెదిరించను. చదువుకున్న వాడివి, ఉద్యోగస్తుడివి, వయసులో వున్నవాడివి నా ఆస్తి నీకో లెక్క కాదనే విషయం తెలియనిదాన్ని కాదు. ఇంకా రాసేందుకు మన మధ్యన ఏమీ మిగలలేదు.

ఇట్లు
అమ్మ

జీవితంలో మొదటిసారిగా తల్లి ఆగ్రహాన్ని చవిచూశాడు సుధాకర్. ముద్దు మురిపాలే తప్ప మందలింపు ఏనాడూ ఎరుగడు. తల్లి గోదారి వరద గోదార్లై మీదికి ఉరికొచ్చి ముంచేస్తుంటే ఆ తాకిడికి తట్టుకోలేని దుర్బలత్వం సుధాకర్ మదిలో. ఇంత వయసొచ్చి ఛీ... తన మీద తనకే ఆగ్రహం లాంటి భావం కలిగింది. అమ్మకు, ఆలికి ఆగ్రహం రాకుండా వున్నంతవరకే మగవాడి జీవనం సుఖమయ మౌతుందనే విషయం అవగాహనకొచ్చింది. నీరజ ఎంతటి ఆగ్రహాన్ని అణచుకుని వుందో... అది మరో ఉప్పెనై తనను ముంచెత్తకముందే జాగ్రత్తపడాలి. ఏమైనా తల్లి ఆగ్రహం తన అలవాట్లపైనే కానీ తన మీద కాదన్న చిన్న నమ్మకం కొంత బలాన్నిచ్చింది. ఒక జత బట్టలు బాగ్‌లో పెట్టుకుని ఇంటినుంచి కదిలాడు.

***

దీపావళి అమావాస్య. ప్రమిదల్లో వత్తులు వేసి నూనె పోసి దీపాలను ఒక్కొక్కటిగా వెలిగిస్తోంది నీరజ. సుధాకర్ వెళ్ళాక ఉత్తరం చదివిన నీరజకు అత్తగారి ఆగ్రహం సహజంగానే తోచింది. హద్దు దాటి అడ్డదిడ్డంగా పరిగెత్తే వ్యక్తికి ఎవరో ఒకరు ముక్కుతాడు వేయాలి. తప్పదు. ఇంటికి యజ మాని అనో, కుటుంబాన్ని పోషి స్తున్న పెద్ద అనో మిన్నకుంటే మొత్తం కుటుంబం అతని వ్యస నాలకు, చేసే తప్పులకు బలి కావాల్సి వుంటుంది.

గేటు కిరువైపులా గోడల మీద ప్రమిదల్లో దీపాలు బారి వెలుగుతున్నాయి. బాల్కనీ లోనూ పద్మం ఆకారంలో దీపా లనుంచింది. కారుచీకట్లో కాంతులు విరజిమ్మే దీపాలు వింత శోభను తెస్తున్నాయి. 'వత్తుల్ని నూనెలో ముందుగా తడిపి వెలిగిస్తే దీపాలు నిలిచి బాగా వెలుగుతాయి.' పెళ్ళైన కొత్తల్లో అత్తగారు చెప్పిన జాగ్రత్త గుర్తొచ్చింది. బ్రతుకు దీపం నిండు నూరేళ్ళు వెలిగేందుకు పెద్దలు కొన్ని హద్దుల్ని, నియమాల్ని ఏర్పరిచారు. వాటిని పాటిస్తే మనిషి జీవనం సుఖమయ మౌతుందన్న అవగాహన మనిషికి, సమాజానికి ఎంత మేలును చేకూరు స్తుందో?! మిలమిల మెరిసే బంగారంలోనూ రాగి వున్నట్లుగా మనిషి యవ్వ నోత్సాహంలో కొద్దిగా అహం కలిసి వుంటుందేమో! తాను సంపాదించి కుటుంబాన్ని పోషిస్తున్నాననే భావన ఆ అహాన్ని మరింతగా పెంచుతుంది. ఆ అహంతోనే వ్యసనాలకు దగ్గరై కుటుంబాలకు దూరమౌతారేమో మగవాళ్ళు.

దొడ్లో తులశమ్మ గూట్లో దీపం వుంచి లోపలి కొచ్చిన నీరజకు హాల్లో షూ లేసు విప్పుకుంటున్న సుధాకర్, ఆ ప్రక్కనే పడక్కుర్చీలో సేదదీరుతున్న అత్తగారు కన్పించారు. అత్తాకోడళ్ళిద్దరూ ఒకరి ముఖంలోకొకరు చూసుకున్నారు. చిరునవ్వుల సవ్వడి ఇరువురి హృదయాల్ని తేలిక జేసింది. నీరజా! మామయ్య వాళ్ళు అమ్మను ససేమిరా పంపమన్నారు. దీపావళి అమ్మ సమక్షంలో జరగాలని నేను పట్టుబట్టి తీసుకువచ్చాను. సంక్రాంతికి మనమందరం అక్కడికి వెళ్ళే షరతుమీద ఒప్పుకున్నారు. అవునూ... పిల్లలేరి? మాట్లాడుతూనే సుధాకర్ ఫ్రిజ్‌లోంచి బత్తాయిలు తీసి తల్లికి జ్యూస్ చేసి తెచ్చి యిచ్చాడు. పిల్లల చేత మతాబులు కాల్పిస్తూ చిరునవ్వులు చిందిస్తున్న భర్తను తదేకంగా చూసింది నీరజ. సుధాకర్ నవ్వితే ముత్యాల మూట విప్పినట్లే. ఇన్నాళ్ళూ ఈ నవ్వులు ఏమయ్యాయి? సుధాకర్ నవ్వలేదా? లేక అతను నవ్వటం తను చూడలేదా?! నీరజా! తారాజువ్వ కాలుస్తావా? భర్త చేతిలోని తారాజువ్వను తీసుకుని అంటించింది నీరజ. వెలుగులు రువ్వుతూ రివ్వున దూసుకెళ్ళిన తారాజువ్వ నీరజ ఆనందానికి ఆకాశమే హద్దని చెప్పింది.

భార్యాపిల్లల కళ్ళల్లోని సంతోషపు కాంతుల ముందు అర్ధరాత్రుళ్ళు వెలిగే బార్ రెస్టారెంట్ నియాన్ లైట్ల వెలుగులు వెలవెలపోయినట్లని పించింది సుధాకర్‌కు.

★



# నెల్లూరు యాసకు మారుపేరు రమణారెడ్డి

తెలుగు టాకీలకు ఆద్యుడైన రఘుపతి వెంకయ్య కుమారుడు రఘుపతి ప్రకాష్ దర్శకత్వంలో రమణారెడ్డి మొదటిసారి వెండి తెరకు ఎక్కారు. అది 1951లో రూపొందిన 'మాయపిల్ల'. అయితే ఆ చిత్రం ప్రజాదరణ పొందకపోవడంతో రమణారెడ్డి కూడా ప్రజలలోకి వెళ్ళలేకపోయారు. నిరుత్సాహపడి సొంత ప్రాంతం నెల్లూరు వెళ్ళకుండా, విక్రమార్కరెడ్డిగా ప్రయత్నాలు సాగించారు. అప్పుడే అనేక అనువాద చిత్రాలకు 'గాత్రదానం' చేశారు. ''చాలా మంది డబ్బులు యివ్వలేదు. అక్షరాలా దానమే'' అంటుండేవారు రమణారెడ్డి.

బంగారు పాప, మిస్సమ్మ చిత్రాలు రమణారెడ్డి పేరును నిలబెట్టాయి. 'బంగారు పాప'లో ముక్కుతో డైలాగులు చెప్పి తెలుగు ప్రేక్షకులను మెప్పించారు. తర్వాత కామెడీ విలన్‌గా స్టాంపు పడిపోయింది. రమణారెడ్డి డైలాగులు నెల్లూరు యాసలో వుంటాయి. ఎవరు సంభాషణలు రాసినా తన సొంత బాణీలోకి మార్చుకునేవారు. సన్నగా పొడుగ్గా చూడగానే నవ్వొచ్చే విగ్రహం, దానికి తోడు విచిత్రంగా పొట్లకాయల్లాంటి చేతులు వూపుతూ మాట్లాడడం ఆయన బ్రాండ్. మాయాబజార్, లవకుశ లాంటి పౌరాణిక పాత్రలలో సైతం, ఆయన ప్రాంతీయ శైలిని డైలాగులలో వాడి వొప్పించిన ఘనత ఆయనకే దక్కుతుంది. 1960లో వచ్చిన రేణుకాదేవి మహత్య్మం చిత్రంలో రమణారెడ్డి నారద పాత్ర ధరించారు. ఆయనని చొక్కా లేకుండా చూస్తే ఎముకల పోగులా కనిపిస్తారు. అందుకని ఫుల్‌షర్టు వేసేవారు నారదుడికి. రమణారెడ్డి కాబట్టి జనం ఆమోదించారు. చొక్కాతో నారద వేషం ధరించిన ఏకైక నటుడు రమణారెడ్డి!

రంగస్థలంపై, వెండితెరపై ఎంతటి పేరు ప్రఖ్యాతులు వున్నాయో, ఇంద్రజాలికుడిగా అంతటి పేరుంది రమణారెడ్డికి. పూర్తి నిడివి మాజిక్ ప్రోగ్రామ్‌ని ఆయన అవలీలగా నిర్వహించేవారు. సన్నగా, పొడుగ్గా వుండే చిత్రమైన ఆయన రూపాన్ని, ఆయన ధరించిన పాత్రల్ని తెలుగువారు ఎన్నటికీ మర్చిపోరు. రమణారెడ్డి యిప్పటికీ వొక పోలికగా, తెలుగునాట వినిపిస్తూ వుంటుంది.